సాక్షి జనగామ

సోమవారం । 6 । మార్చి । 2023



మహిళల అభ్యున్నతికి సీఎం కృషి

మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸



ఎండుతున్న పంటలు

భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు చివరి దశలో ఎండిపోతున్నాయి. - 9లో▸

గరిష్టం/కనిష్టం
$36^{0}/19^{0}$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత కాస్త పెరుగుతుంది. రాత్రి పూట చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

శివప్రసాద్‌కు వైదిక పురోహితరత్న అవార్డు



రఘునాథపల్లి: ఖిలాషాపూర్ శివాలయ వేద పండితులు పాగాలమఠం సాయిశివప్రసాద్‌ను వైదిక పురోహితరత్న అవార్డు వరించింది. ఆదివారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 27వ ఉగాది పురస్కారాల మహోత్సవంలో సాయిశివప్రసాద్‌కు సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, గ్రామపెద్దలు శివసాయిప్రసాద్‌ను అభినందించారు.

దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోవాలి

జనగామ రూరల్: జిల్లాలోని వివిధ రకాల వైకల్యాలు కలిగిన అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం సోమవారం మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ ఓపెన్ అవుతుందని, ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం బుక్ చేసుకోవాలని సూచించారు. కొత్తవి, రెన్యూవల్ కొరకు మీసేవలో సంప్రదించాలని పేర్కొన్నారు.

8 వరకు ఫార్మసీ పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కేయూ బీఫార్మసీ(సీబీఎస్) మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 8వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఆదివారం తెలిపారు. అలాగే ఎంఫార్మసీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రూ.250 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 8 వరకు గడువు ఉందని వారు పేర్కొన్నారు.

గోవుల పెంపకంతో బహుళ ప్రయోజనాలు



కొడకండ్ల: రైతులు గోవులను పెంచుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయని, గోఆధారిత సేంద్రియ వ్యవసాయం చేయవచ్చని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక రైతులు 10 మందికి యాకన్న గోశాల ఆధ్వర్యంలో లేగ దూడలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు రాములునాయక్, కమలాకర్, అరవింద, యాకూబ్ పాల్గొన్నారు.

ఐలోని మల్లన్నకు మొక్కులు



ఐనవోలు: ఐలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం వారాంతపు జాతరలో భాగంగా భక్తుల రద్దీ నెలకొంది. రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా చేరుకుని సందడి చేశారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో మల్లన్న మేల్కొనగా.. స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. శనివారం సాయంత్రమే ఆలయానికి చేరుకున్న భక్తులు పట్నాలు, బోనాల మొక్కులు చెల్లించుకుని ఆదివారం ఉదయం నుంచి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. కొందరు భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుని ఒగ్గు సంప్రదాయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావ(రథం) లాగి మొక్కులు తీర్చుకోగా.. మరికొందరు వరం పట్టారు, వడి బియ్యం సమర్పించారు. టెంకాయ బంధనం లాంటి కార్యక్రమాలు చేశారు. స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని, ఎండ తీవ్రతతో ఇబ్బంది పడినట్లు పలువురు భక్తులు తెలిపారు. ఆలయంలో ఏర్పాట్లను ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు పర్యవేక్షించారు. దేవాలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ విద్యకు.. విద్యానిధి

ఓవర్‌సీస్ పథకాలతో పేద విద్యార్థులకు చేయూత

- జిల్లా నుంచి ఇప్పటి వరకు 24 మందికి అవకాశం
- అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజనం
- దరఖాస్తుకు ఈనెల 8 వరకు గడువు



జనగామ రూరల్: డిగ్రీ పూర్తి చేసి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనే ఆసక్తి ఉండి ఆర్థిక స్తోమత లేని వెనుకబడిన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 'విదేశీ విద్యా నిధి' పథకం ద్వారా చేయూత ఇస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు అంబేడ్కర్ ఓవర్‌సీస్ పథకం ద్వారా, బీసీ విద్యార్థులకు ఎంజేపీ విద్యానిధి పథకం, మైనార్టీలకు సీఎం ఓవర్‌సీస్ ద్వారా రూ.20 లక్షల రుణాన్ని రెండు విడతల్లో అందజేస్తున్నది. 2014–15 నుంచి అమలవుతున్న ఈ పథకాలపై అవగాహన లేక చాలా మంది వినియోగించుకోలేకపోతున్నారు.

నామమాత్రంగానే.. వినియోగం

నిరుపేద విద్యార్థులకు విదేశీ విద్య అభ్యసించడానికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తున్నా సద్వినియోగం చేసుకుంటుంది కొద్ది మంది మాత్రమే. అంబేడ్కర్ ఓవర్‌సీస్ పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లవుతున్నా.. ఇప్పటి వరకు జిల్లా నుంచి విదేశాలకు వెళ్లింది 8 మంది మాత్రమే. ముఖ్యమంత్రి ఓవర్‌సీస్ ద్వారా 2019–20లో ముగ్గురు, 2020–21లో ఒక్కరు ఎంపికయ్యారు మహాత్మా జ్యోతీబా పూలే విద్యానిధి పూర్తి రాష్ట్రస్థాయిలోనే ఉన్నందున వారి టార్గెట్ ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. జిల్లా నుంచి ఇప్పటి వరకు 12 మంది ఎంపికైనట్లు సమాచారం. ఇందులో కొంత మంది ఉన్నత విద్యనభ్యసించగా.. అవకాశం ఉన్న వారు విదేశాల్లోనే స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన అవసరం

జిల్లా వ్యాప్తంగా ఏటా వందల సంఖ్యలో విద్యార్థులు పట్టభద్రులవుతున్నారు. ఆయా రంగాల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న చాలా మందికి విదేశాల్లో చదువుకోవాలనే కోరిక, తపన ఉండి ఆర్థిక పరిస్థితి సహకరించక వెళ్లలేక పోతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తే అందరూ అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో 17 వరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒక ఇంజనీరింగ్, ఒక ఫార్మసీ కళాశాల ఉంది. అధికారులు, ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఈ ఓవర్‌సీస్ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్హతలు

- ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్రం కోర్సుల్లో డిగ్రీ, 60 శాతానికి పైగా మార్కులు కలిగి ఉండాలి.
- టోఫెల్‌లో 60 శాతం, ఐఈఎల్‌టీఎస్ 80 శాతం మార్కులు, జీఆర్‌ఈ, జీమ్యాట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి ఉండాలి.
- విద్యార్థుల వయస్సు 35 ఏళ్లకు మించ కూడదు. వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

విదేశీ విద్యానిధి పొందాలనుకునేవారు కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ, ఆధార్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ మెమోలతో పాటు టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్‌ఈ, జీమ్యాట్ అర్హత కలిగి ఉండాలి. అలాగే సంబంధిత కళాశాల ప్రవేశ అనుమతి పత్రం, కళాశాలకు చెల్లించిన ప్రవేశ రుసుం రసీదు, బ్యాంక్ ఖాతా వివరాల ఆధారంగా మీసేవా ద్వారా తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.10 విలువైన నాన్ జ్యుడీషియరీ స్టాంప్ అతికించి రిజిస్ట్రార్ సంతకంతో కూడిన ధ్రువీకరణను ఆదాయ ధ్రువీకరణ పత్రానికి జత చేసి సమర్పించాలి. ఆయా సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పరిశీలించి ఎంపిక చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విదేశాల్లో చదువుకోవాలని ఆసక్తి ఉన్న ప్రతి పేద విద్యార్థికి ప్రభుత్వం ఆర్థికంగా చేయుతనందిస్తున్నది. ఇందుకు రూ.20 లక్షలను రెండు దఫాలుగా అందిస్తున్నది. ఈ అవకాశం ఏడాదికి నాలుగు సార్లు ఉంటుంది. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను అర్హతను బట్టి ఎంపిక చేస్తారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గడువు పెంచే అవకాశం కూడా ఉంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– బి.రవీందర్, జిల్లా బీసీ సంక్షేమాధికారి

మహిళలను గౌరవించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మహిళలను గౌరవించాలి.. అది మన సంప్రదాయం.. మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీఆర్‌ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8న నిర్వహించే వేడుకల్లో ప్రధానంగా మహిళా ప్రజాప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం వేడుకలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కుందూరు జ్యోతిరెడ్డి, ఉడుగుల భాగ్యలక్ష్మి, నాగపురి పావని, వడ్లూరి మమత, తిప్పారపు రమ్య, లీల తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి



రఘునాథపల్లిలో మాట్లాడుతున్న రాజారెడ్డి

రఘునాథపల్లి: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ స్థానిక కార్యాలయంలో చాడా ఎల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకోసం సీపీఐ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర చేపడుతున్నామని, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. హైదరాబాద్ నుంచి జనగామ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆది సాయన్న, కావటి యాదగిరి, మడికంటి సోమయ్య, ఎల్లయ్య, వెంకన్న, ఉప్పలయ్య, శ్రీను, దేవస్వామి, రమేష్, ఉదయ్, నర్సింగరావు, నాగేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్‌పీఎస్సీ పరీక్షలు



పరీక్షల తీరును పరిశీలిస్తున్న సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న ఏఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 8,245 మంది అభ్యర్థులకు ఉదయం పరీక్షకు 6,522 మంది(79.10 శాతం), సాయంత్రం పరీక్షకు 6,483 మంది(78.63 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. మొత్తం 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలను హనుమకొండ అదనపు కలెక్టర్ సంధ్యారాణి పర్యవేక్షించారు.

వైష్ణవి స్కూల్ అనుమతి రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌జేడీ

జనగామ: పట్టణంలోని వైష్ణవి స్కూల్ అనుమతులను రద్దు చేస్తూ స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఇ.విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. పాఠశాలలో అడ్మిషన్ రిజిష్టర్లు, టీసీ బుక్కులు తదితర రికార్డులను స్వాధీనం చేసుకుని భద్రపరచాలని డీఈఓ రామును ఆదేశించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, పదో తరగతి విద్యార్థులపై ఎటువంటి ప్రభావం, ఒత్తిడి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రికార్డులు స్వాధీనం చేసుకోవడానికి ఎంఈఓతో పాటు నోడల్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించామని, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయమై మాట్లాడాలని సూచించినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని వివరించారు.

నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : ఎస్‌ఎఫ్‌ఐ

సుదీర్ఘ పోరాటాల ఫలితంగా పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న వైష్ణవి స్కూల్ అనుమతులను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, ధర్మభిక్షం అన్నారు. కొంతమంది ప్రైవేట్ యాజమాన్యాలతో కుమ్ముక్కు కావడంతోనే చర్యలు ఆలస్యంగా తీసుకున్నారని పేర్కొన్నారు.

పోరాటాల ఫలితమే : ఎన్‌ఎస్‌యూఐ

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ నిర్వహిస్తున్న వైష్ణవి స్కూల్ అనుముల రద్దు తమ పోరాట ఫలితమే అని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ అన్నారు. సమగ్ర విచారణ చేపట్టి.. యాజమాన్యానికి సహకరించిన అధికారులపైనా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వామివారికి చక్రస్నానం



చక్రస్నానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచర్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ హోమం, మహా పూర్ణాహుతి, స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన చక్ర స్నానంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజయ్యతో పాటు సర్పంచ్ రాజ్‌కుమార్, ఈఓ వెంకట్రావు, ఉప సర్పంచ్ మహేందర్, దాతలు గుళ్లపల్లి శ్రీనివాస్–భవాని, సంగోజు మోహనచారి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, మాజీ చైర్మన్ మూల నాగరాజు, నారగోని రాజు, పన్నీరు అశోక్, జిల్లా రాజు, గొల్లపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుట్ట కింద ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో నారగోని రాజు, సట్ల లింగయ్య, గనగోని రమేష్, మాచర్ల ప్రవీణ్, నారగోని రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు జాతరకు సర్వం సిద్ధం
ప్రభుత్వంపై యుద్ధమే..
మహిళలపై వివక్ష కొనసాగుతోంది
హృదయంపై అప్రమత్తంగా ఉండాలి
-10లో..



ప్రీతి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్తుండగా.. కన్నీటిపర్యంతమవుతున్న బంధువులు

జ్ఞాపకాలే మిగిల్చావా బిడ్డా..

- పుట్టెడు దుఃఖంతో ప్రీతి కుటుంబం
- గిర్నితండా నుంచి హైదరాబాద్‌కు పయనం

కొడకండ్ల: మట్టిలో కలిశావు.. మాకు జ్ఞాపకాలే మిగిల్చావా బిడ్డా.. అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తూ గిర్నితండా నుంచి హైదరాబాద్‌కు ఆదివారం బయలుదేరారు మెడికో ధరావత్ ప్రీతి కుటుంబసభ్యులు. కొండంత అండగా ఉంటావనుకుంటిమి.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా.. నీకు బదులు నీ ఫొటో తీసుకెళ్లాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.. కరోనా కష్టకాలంలో ఎంతో మందికి ధైర్యంగా వైద్యం చేస్తివి.. పెద్ద డాక్టర్ అవుతావనుకుంటే మమ్ములను విడిచి పోయావా తల్లీ.. అంటూ ప్రీతి తల్లిదండ్రులు ధరావత్ నరేందర్–శారద, అక్కలు పూజ, ఉష, సోదరుడు వంశీ గుండెలు పగిలేలా రోదించారు. వారం రోజుల పాటు పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని గడిపిన ఆ కుటుంబం బరువైన గుండెలతో హైదరాబాద్‌కు బయలుదేరగా బంధువులు సైతం కన్నీరు ఆపుకోలేక పోయారు.

ప్రశాంతంగా 'ప్రతిభా' పరీక్ష



పరీక్ష సెంటర్‌లో పరిశీలిస్తున్న ఆర్‌సీఓ విద్యారాణి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల 33 ప్రతిభా కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం(2023–24) ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ రీజియన్‌లోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు 16 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ అడ్మిషన్ల ప్రవేశ పరీక్షకు 6,085 మంది హాజరు కావాల్సి ఉండగా.. అందులో 5,725 మంది విద్యార్థులు(94.08 శాతం) హాజరయ్యారని సాంఘిక సంక్షేమ గురుకులాల వరంగల్ రీజియన్ కోఆర్డినేటర్ విద్యారాణి తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారని తెలిపారు. ఇక డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు వరంగల్ రీజియన్ పరిధిలో 1,728 మంది విద్యార్థులకు.. 1,611 మంది (93.4 శాతం) హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్ష కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. కాగా.. పలు పరీక్ష కేంద్రాలను ఆర్‌సీఓ విద్యారాణి సందర్శించి.. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

భీమ్‌రెడ్డి చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి



నినాదాలు చేస్తున్న మల్లయ్య, తదితరులు

పాలకుర్తి టౌన్: తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన యోధుడు భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలని తెలంగాణ మహాసభ వ్యవస్థాపకుడు కొత్తగట్టు మల్లయ్య అన్నారు. భీమ్‌రెడ్డి స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి అంటే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కేంద్ర బిందువని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవిస్తున్నారంటే నాడు ఆయన చేసిన పోరాట ఫలితమే అని అన్నారు. కార్యక్రమంలో బహుజన కులాల ఐక్యవేదిక వ్యవస్థాపకుడు గుమ్మడిరాజు సాంబయ్య, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, జంబుద్వీప జన సమితి వ్యవస్థాపకుడు యాదగిరి, సీపీఎం నాయకులు చిట్యాల సోమన్న గొల్లపల్లి శేఖర్, తూరపాటి సారయ్య, గాయల బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలి



దివ్య బలి పూజలో పాల్గొన్న బిషప్ ఉడుముల బాల, డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి, ఫాదర్లు, విద్యార్థులు

- డాక్టర్ బిషప్ ఉడుముల బాల
- సీజేఐటీలో రజతోత్సవ దివ్యబలిపూజ

జనగామ: విద్యార్థులు నేటి ఆధునికతకు తగినట్టుగా ప్రణాళికతో ముందుకుసాగితే విజయం సాకారం అవుతుందని ఉమ్మడి వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల రజతోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కృతజ్ఞత దివ్యబలి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉడుముల బాల మాట్లాడుతూ మారుమూల గ్రామాల విద్యార్థులకు సైతం సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే సంకల్పంతో 25ఏళ్ల క్రితం ప్రారంభమైన క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల వేలాది మంది జీవితాల్లో వెలుగు నింపిందని చెప్పారు. కళాశాల డైరెక్టర్, ఫాదర్ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల సక్సెస్‌కు కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దేవుని కృప, బిషప్, కళాశాల ఫౌండర్ కొలొంబో, ఫాదర్స్, సిస్టర్స్ సేవలు మరువలేని పేర్కొన్నారు.

తానునాయక్ స్ఫూర్తితో ఉద్యమించాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



తానునాయక్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బండి సంజయ్



జనగామలో బండికి స్వాగతం పలుకుతున్న దశమంతరెడ్డి, నాయకులు

కొడకండ్ల : నిజాంకు ముచ్చెమటలు పట్టించి ప్రాణత్యాగం చేసిన బంజారా పోరాట యోధుడు జాటోత్ తానునాయక్ స్ఫూర్తితో పోడుపట్టాల కోసం కేసీఆర్ ప్రభుత్వంపై ఉద్యమించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. మృతి చెందిన మెడికో ధరావత్ ప్రీతి కుటుంబాన్ని పరామర్శించడానికి ఆదివారం వచ్చిన ఆయన గిర్నితండాలోని తానునాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ భూపోరాటంలో నిజాం చెంచాల దాడులకు ఎదురొడ్డిన తానునాయక్ హక్కుల కోసం చివరి వరకు పోరాడినట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మరో నిజాంలా వ్యవహరిస్తూ ఎన్నికలు రాగానే పోడు భూముల సమస్య పరిష్కరిస్తానంటూ మాయమాటలు చెబుతున్న మోసగాడని, గిరిజనులంతా ఏకమై న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాడాలని, బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, రవీంద్రనాయక్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య, లేగ రామ్మోహన్‌రెడ్డి, శ్రీమాన్, దుబ్బ రాజశేఖర్, కుమార్, ఉపేందర్, రాయుడు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి ఘన స్వాగతం

జనగామ/నర్మెట: మెడికో ప్రీతి కుటుంబాన్ని పరామర్శించేందుకు గిర్నితండాకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి ఆదివారం జనగామ చౌరస్తాలో ఘనస్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర తిరుపతిరెడ్డి, బేజాడి బీరప్ప, కేవీఎల్‌ఎన్.రెడ్డి, సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, హరిచంద్ర గుప్త, పవన్ శర్మ, వెంకటరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సంపత్, సందీప్, హరీష్, ఆంజనేయులు, వెంకట్, జగదీష్, చంద్రం పాల్గొన్నారు. అలాగే నర్మెట మండలం హన్మంతాపూర్‌లోనూ ధరావత్ రాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

క్లుప్తంగా

చంపుతామని బెదిరించిన వారిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన చిందుకూరి ఏడుకొండలును హైదరాబాద్‌కు చెందిన నూనావత్ భూపాల్ నాయక్, మరికొంతమంది కలిసి హత్యచేసి చంపుతామని బెదిరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వై.సతీష్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట హ్యాపీ స్టే ఇన్ లాడ్జీని నువ్వు ఎందుకు కొనుగోలు చేశావని ఏడుకొండలును కిసాన్ పరివార్ సంస్థ నిర్వాహకులు భూపాల్ నాయక్, మరికొంతమంది కలిసి చంపుతామని బెదిరించారన్నారు. దీంతో అతడు తనకు ప్రాణభయం ఉందని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై విజయరాంకుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ఖిలావరంగల్: ఓ మైనర్ బాలికను అత్యాచారయత్నానికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికను అదే ప్రాంతంలో వెల్డింగ్ పనిచేస్తున్న వ్యక్తితో పరిచయం ఏర్పడింది. బాలిక అతడితో తరుచూ మాట్లాడటంతో ఒంటరిగా ఉన్న ఆ బాలికపై అత్యాచారయత్నానికి యత్నించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలుపగా తల్లి సహకారంతో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

ఖిలా వరంగల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం వరంగల్ గవిచర్ల క్రాస్ రోడ్డు సమీపంలో జరిగింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం గుడెప్పాడు గ్రామానికి చెందిన మహబూబీ.. కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి కారులో తిరిగి గుడెప్పాడుకు బయల్దేరారు. ఈక్రమంలో వరంగల్ గవిచర్ల క్రాస్‌రోడ్డు సమీపానికి రాగానే కారును ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న మహబూబీకి తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. క్షతగాత్రురాలిని స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి మిల్స్ కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

మహిళల అభ్యున్నతికి సీఎం కృషి

- 8న కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు: మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలను మంత్రి సత్కరించారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావుతో కలిసి మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు స్త్రీ నిధి పథకం ద్వారా రూ. 18 వేల కోట్ల రుణాలు అందించామన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు తేవాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిందని, కేంద్రం మాత్రం నేటికీ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించలేదన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

ఈ నెల 8న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తొర్రూరుకు రానున్నారని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి దయాకర్‌రావు కోరారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో సభాస్థలి, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలను మంత్రి పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 20 వేల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు కేటీఆర్ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్ పంజా కల్పన, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుమర్తి శాంత, పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో మాట్లాడుతున్న మంత్రి

ఎండు గంజాయి పట్టివేత



నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జితేందర్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

- మొబైల్ ఫోన్, ఆటో స్వాధీనం
- ఇద్దరు పరార్, ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి

ఖిలావరంగల్ : అక్రమంగా నిల్వ చేసి ఇతరులకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్న 1.200 కిలోగ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్‌రావు, ఎన్.వెంకటేశ్వర్లులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ ప్రాంతం ఏసీరెడ్డినగర్ చెందిన ములుగు వినయ్, పోచమ్మమైదాన్ వాసవికాలనీకి చెందిన జన్ను ప్రశాంత్, వరంగల్ డాక్టర్ కాలనీ ఫేస్-1, సీపీఎం హట్స్, గౌతంనగర్‌కు చెందిన షేక్ ఫరాజ్, శివనగర్‌లోని సాయిబాబాలేన్‌కు చెందిన పాకాల సాయి, ఏసీరెడ్డినగర్‌కు చెందిన ములుగు వికాస్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరు శివనగర్‌కు చెందిన సాయి, విక్కీల నుంచి కొనుగోలు చేసిన ఎండు గంజాయిని సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో 1.200 కిలోగ్రాముల ఎండు గంజాయి లభించింది. పాకాల సాయి, ములుగు వికాస్ ఇద్దరు పరారు కాగా వినయ్, జన్ను ప్రశాంత్, షేక్ ఫరాజ్‌ను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వడ్డెబోయిన లవన్‌కుమార్, ఎండీ నిస్సార్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

కాజీపేట: గంజాయికి అలవాటు పడిన ముగ్గురు యువకులను ఆదివారం అరెస్ట్ చేసి ఒక కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ఎస్సై ప్రమోద్ కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనబడగా పోలీసులను చూసి పరార్ కావడానికి ప్రయత్నించారు. యువకుల కదలికలను కనిపెట్టిన ఎస్సై నిందితులను వెంటాడి పట్టుకోగా కిలోఎండు గంజాయి లభించిందన్నారు. వైఎస్సార్ నగర్ కాలనీకి చెందిన గనిపాక సాయికృష్ణ, బల్లి మధు, టేకులగూడెం గ్రామానికి చెందిన కొట్టె రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై మాచర్ల శ్వేత, చిట్టిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, తదితరులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్
- బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఎంజీఎం/వరంగల్: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం హన్మకొండలో మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలతో పాటు ప్రీతి ఘటనకు నిరసనగా వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి కేఎంసీ వరకు బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు, పార్టీ కార్యకర్తలతో కలిసి బండి సంజయ్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 'నిరసన దీక్ష' చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, హన్మకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, పార్టీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి భద్రకాళీ దేవాలయం ప్రధానం ద్వారం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పూటకో అత్యాచారం, రోజుకో హత్య జరుగుతున్నా సీఎం కేసీఆర్ స్పందించడం లేదన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 11 శాతం నేరాలు పెరిగాయన్నారు

ప్రీతికి ఘన నివాళి

వరంగల్: ఇటీవల ర్యాగింగ్‌తో మృతి చెందిన కేఎంసి విద్యార్థిని డాక్టర్ ప్రీతికి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాటోతు హుస్సేన్ నాయక్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ప్రీతి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ మద్దతుంటే క్రిమినల్స్ ఏం చేసినా చెల్లుతుందని ప్రీతి ఘటన నిరూపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపుపై నేతల ఆగ్రహం



ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో బీజేపీ నేతల వాగ్వాదం

వరంగల్/ఎంజీఎం: మెడికో ప్రీతి ఆత్మహత్య చేసుకున్న మెడికోకు సంతాపం తెలుపుతూ ఆదివారం సాయంత్రం పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి కేఎంసీ వరకు చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను గ్రేటర్ కార్పొరేషన్‌కు చెందిన డీఆర్ఎస్ సిబ్బంది తొలగించారు. ఈక్రమంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బందితో నాయకులు వాగ్వాదానికి దిగారు. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ కుసుమ సతీష్ మాట్లాడుతూ బీజేపీ అంటే తూర్పు ఎమ్మెల్యేకు భయం పట్టుకుందని, బండి సంజయ్ అంటే రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు వణుకు పుడుతోందని ఆరోపించారు.

ఫేర్‌వెల్ వేడుకల్లో 'ఘర్షణ'

- మద్యం తాగిన విద్యార్థులు... చితకబాదిన అధ్యాపకులు

హసన్‌పర్తి: ఫేర్‌వెల్ వేడుకల్లో ఓ ఘటన ఘర్షణకు దారితీసింది. నగరంలోని భీమారం ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం స్థానికంగా ఉన్న ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఫెయిర్‌వెల్ వేడుకలు నిర్వహించింది. ఓ వైపు వేడుకలు కొనసాగుతుండగా మరోవైపు పరిసర ప్రాంతంలో కొంత మంది విద్యార్థులు మద్యం సేవించడం ప్రారంభించారు. దీంతో విద్యార్థుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న అధ్యాపకులు అక్కడికి వెళ్లి వారిని మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులు అధ్యాపకులపై తిరగబడినట్లు తెలిసింది. దీంతో అధ్యాపకులు వారిని చితకబాదారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న పోలీసులు

పోలీసులకు సమాచారం..

ఫంక్షన్‌హాల్‌లో గొడవ జరుగుతున్నదనే సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. గొడవకు దారి తీసిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా తమ పిల్లలను అధ్యాపకులు కొట్టారనే సమాచారంతో తల్లిదండ్రులు ఫంక్షన్ హాల్‌కు చేరుకుని విషయాన్ని ఆరా తీశారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షుడిగా రాము



హన్మకొండ అర్బన్ : విశ్వ ఆయుర్వేద పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గోకారపు రాము ఎన్నికయ్యారు. నగరంలోని సామ జగన్మోహన్ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోతు మహేష్, ఉపాధ్యక్షులుగా బి.సత్యప్రకాశ్, హెచ్.సునంద, ఎం.విజయ్‌కుమార్, పి.కిరణ్, కార్యదర్శులుగా కె.జగన్‌మోహన్‌చారి, ఎం.కృష్ణమూర్తి, సీహెచ్.అరుణ్, ఎల్.కరుణాకర్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. జనగామ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్‌గా పి.సత్యం, వి.అజయ్‌కుమార్, కె.రమ, ములుగు జిల్లాకు పి.కుమారస్వామి, బి.వరప్రసాద్, భూపాలపల్లి జిల్లాకు పి.తనుజ రాణి, జగదీష్ ఖన్నా, మహబూబాబాద్ జిల్లాకు ఆర్.శ్రీనివాస్, బి.రమ, బి.పార్థు, కె.చంద్రశేఖర్, హనుమకొండ జిల్లాకు ఎస్.వెంకటనారాయణ, గోపు రవీందర్, వరంగల్ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్లుగా జె.సంపత్, పి.సంపత్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగణేష్‌రెడ్డి, టి.ప్రేమానందరావు, సమ్మిరెడ్డి, బి.కిషన్, వై.శ్రీనివాసులు, సుధ, శ్రీధర్, చంద్రశేఖర్ ఆర్య పాల్గొన్నారు.

పాలకు వెళ్లి అనంతలోకాలకు..

- ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం
- మృతుడు శివనగర్ వాసి



ప్రదీప్‌చౌదరి (ఫైల్)

మామునూరు: మసక చీకట్లోనే గేదె పాలు తెస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లిన ఓ వ్యక్తి అనంత లోకాలకు వెళ్లాడు. ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున గవిచర్ల రోడ్డుపై రాంగోపాలపురం బస్టాప్ వద్ద చోటు చేసుకుంది. మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి గుంటూరుపల్లికి చెందిన బొట్ల రమాదేవి, మల్లికార్జున్ దంపతుల కుమారుడు ప్రదీప్ చౌదరి(28) శివనగర్ పల్లవి ఆస్పత్రి ఏరియాలో భార్య, మూడేళ్ల కుమార్తెతో కలిసి నివాసం ఉంటూ పాలు,పెరుగు వ్యాపారం చేస్తున్నాడు. ప్రదీప్ చౌదరి బైక్‌పై ప్రతిరోజు ఉదయం 5 గంటలకు సంగెం మండలం గుంటూరుపల్లికి వెళ్లి గేదె పాలు తెస్తుంటాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం 5 గంటలకు గుంటూరుపల్లికి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో గవిచర్ల రోడ్డుపై రాంగోపాలపురం బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ప్రదీప్‌చౌదరికి తలకు బలమైన తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని 108 వాహనంలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. ప్రదీప్ మృతితో గుంటూరుపల్లి, శివనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటన స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి చేరుకుని వివరాలు సేకరించారు. మృత్యువుకు కారణమైన ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని రైల్వే ఉద్యోగి మృతి

కాజీపేట: కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ రైల్వే డీజిల్ షెడ్‌లో టెక్నీషియన్-3గా పనిచేస్తున్న ఉద్యోగి ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రం నలంద జిల్లాకు చెందిన రవికుమార్ సిన్హా (26) దాదాపు 8 నెలల కింద వివాహం చేసుకున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒంటరిగానే ఇంట్లో ఉంటూ విధులకు హాజరై వెళ్లివస్తున్నాడు. ఏం జరిగిందో తెలియదు గానీ రవికుమార్ సిన్హా ఆత్మహత్యకు పాల్పడ్డాడని, భార్య, బంధువులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

డివైడర్ ఢీకొని ఒకరు..

మరిపెడ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మహబూబాబాద్ రోడ్డులోని డివైడర్‌ను ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో ఇద్దరు యువకులు బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ క్రమంలో గుగులోతు లాలు(41) అక్కడికక్కడే మృతి చెందగా సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింహులపేట మండలం జయపురం గ్రామం శివారు దాసుతండాకు చెందిన వీరు మరిపెడలోని ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



లాలు మృతదేహం


రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

సంగెం/కాశిబుగ్గ : ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సీహెచ్. పరశురాములు తెలిపారు. ఆదివారం ఉదయం వరంగల్-విజయవాడ డౌన్ లైన్‌లో 391/22-24 కిలోమీటర్ వద్ద చింతలపల్లి, ఎల్గూర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు నుంచి జారిపడడంతో 25 నుంచి 30 ఏళ్ల వయసు గల యువకుడు మృతి చెందాడన్నారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ లేత గులాబీ రంగు ఫుల్ షర్ట్ దానిపై బ్లూ కలర్ నైలాన్ జాకెట్ ధరించి ఉన్నాడు. నలుపురంగు తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు గుండ్రని ముఖం, ఎరుపురంగు ఐదున్నర అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడన్నారు. మృతునివద్ద బ్లాక్ కలర్ గ్లోనీ కంపెనీ ఫోన్ అందులో ఎన్‌సెల్ సిమ్, నేపాల్ రూ.20 నోట్ దొరికినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా తెలిస్తే వరంగల్ రైల్వే ఎస్సై 9866330257, 9440627532 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

డోర్నకల్ : మండల శివారులో చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం శివారు రేకులతండాకు చెందిన దారావత్ కృష్ణ(46) మండలంలోని ముల్కలపల్లి శివారులోని ఆకేరువాగులో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై శ్యాంసుందర్‌ను వివరణ కోరగా మృతుడు చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు సమాచారం అందిందన్నారు. మృతదేహం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటన జరిగిన ప్రదేశం డోర్నకల్ మండల పరిధిలో ఉండటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

మహాముత్తారం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోర్లగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ..మండలంలోని బోర్లగూడెంకు చెందిన గుంజ సరోజన (55) భర్త వెంకటయ్య మద్యానికి బానిసై కుటుంబ బాధ్యత మరిచి పట్టించుకోకపోవడంతో పలు మార్లు భర్తను మందలించింది. అయినప్పటికీ భర్తలో మార్పు రాకపోవడంతో కుటుంబపోషణ భారమై మనస్తాపానికి గురైంది. దీంతో శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తూరులో వివాహిత..



అనూష మృతదేహం

తొర్రూరు రూరల్ : ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుర్తూరులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసర్ల అనూష (30) పెళ్లి చేసుకొని ఏళ్లు గడుస్తున్నా సంతానం కావడం లేదని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలానగర్‌కు చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏఎస్ఎం మహిళా డిగ్రీ కళాశాల రోడ్డుకు చెందిన యువతి సుమశ్రీ కాలేజీకి వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించడం లేదు. దీంతో ఆదివారం సాయంత్రం యువతి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.